క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా'' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ కేవీఎంఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారంలోకి వెళ్తుందన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గురించి ఎస్ఐ సురేష్ చావా విద్యార్థులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్అండ్బీ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



గన్నవరం: స్థానిక గన్నవరం – ఆగిరిపల్లి ఆర్అండ్బీ రహదారి విస్తరణ పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గన్నవరం పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. దీనిలో భాగంగా గన్నవరం – ఆర్అండ్బీ రోడ్డును విస్తరించడంతో పాటు బ్యూటిఫికేషన్ చేపడతామని చెప్పారు. దాతలతో పాటు తన సొంత నిధులతో మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల వినతి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా స్థానిక మండలాల్లోనే పోస్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బాపులపాడు మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఎంపీడీవో, తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 5ను సవరించాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు లేని నిబంధన కేవలం గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఎందుకు వర్తిస్తుందని ప్రశ్నించారు. సెలవు రోజుల్లో టెలి కాన్ఫరెన్స్‌లు నుంచి విముక్తి కల్పించాలని, తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిన్నమనేని సిద్ధార్థ గ్రామీణ ఆరోగ్య కేంద్రం(వేలేరు) వైద్యులు పొట్లూరి సాయికిరణ్ అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు రుతుక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీరియడ్స్‌పై అపోహలు, మూఢ నమ్మకాలను విడిచిపెట్టాలన్నారు. పీరియడ్స్ సమయంలో ఎదురయ్యే సమస్యలు, వాస్తవాలను వివరించారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.మహేష్ కమల్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దాతలు సాంబశివనాగరాజు, లీలావతి దంపతులు(వేలేరు) సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాలువలు అస్తవ్యస్తం..సాగునీరు ప్రశ్నార్థకం!

- తూడు, గుర్రపుడెక్కతో కాలువలు
- వ్యర్థాలతో నిండిన పంటబోదెలు
- జమ్మి మొలిచి ఆనవాలు కోల్పోయిన కాలువలు



కంకిపాడు బందరు కాలువలో ఎండిపోయిన గుర్రపుడెక్క

కంకిపాడు: సాగునీటితో ప్రవహించాల్సిన పంట కాలువలు తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయాయి. జమ్మి ఏపుగా పెరిగి పంట కాలువ ఆనవాలు కూడా లేకుండా పోయాయి. తూడు నిర్మూలనకు చర్యలు చేపట్టామంటూ అధికారులు చెబుతున్న మాటలు వాస్తవ రూపం దాల్చటం లేదు. ఏ పంట కాలువ చూసినా తూడు, గుర్రపుడెక్కతో నిండి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి.

కాలువల ఆధారంగా సాగు..

పెనమలూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో 42 వేల ఎకరాల్లో సాగుభూమి ఉంది. ప్రధానంగా వరి, చెరకు, పసుపు, కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఇక్కడ సాగు బోర్లు సదుపాయం మీదే కాకుండా కాలువల ఆధారంగా కూడా సాగుతుంది. కాలువ నీటిపై ఆధారపడి సాగుకు అవసరమైన నీటిని సమకూర్చుకోవటంతో పాటుగా పంట పొలంలో అధికంగా ఉన్న మురుగును పక్కనే ఉన్న మురుగు బోదెలు, కాలువల్లోకి మళ్లించి పంటకాలువలను రక్షించుకునే పరిస్థితి.

కాలువలు అధ్వానం..


కంకిపాడు సెక్షన్ పరిధిలో బందరు కాలువ, పుల్లేరు, వల్లూరు పటమట కాలువల కింద అనేక పంట కాలువలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా పొలాల్లో మురుగు తరలించేందుకు మురుగు కాలువలు కూడా ఉన్నాయి. సెక్షన్ కింద 35 వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. ఇటీవల కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు రూ.1.40 కోట్లు నిధులు కేటాయించారు. ఈ నిధులతో పలు ప్రధాన కాలువల్లో తూడు, పూడికతీత తొలగింపులు నిర్వహించారు. అయితే మెజారిటీ కాలువల్లో ఎక్కడ చూసినా తూడు, గుర్రపుడెక్క కనిపిస్తోంది. వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి ఉన్నాయి. జమ్మి మొలిచి పంట కాలువలు, బోదెలు ఆనవాలు కోల్పోయాయి. తూడు తొలగింపు పనులు సమర్థంగా సాగకపోవటంతో సాగునీటికి తిప్పలు తప్పవంటూ రైతులు వాపోతున్నారు.

సాగునీరు ప్రశ్నార్థకమే..

10 రోజుల క్రితం బందరు కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. అయితే ఈ నీరు నేరుగా కిందకే పోతుంది. ప్రస్తుతం ఇక్కడి పరిసరాల్లో భూములను దమ్ములుచేయటంతో పాటుగా వరి నారుమడులను కూడా పోసుకున్నారు. వరి నారుమడులు నాట్లకు రెడీ అవుతున్నాయి. అయినా నేటికీ పంట కాలవుల్లో తూడు తొలగింపులు పూర్తి స్థాయిలో జరగలేదు. ఎక్కడ చూసినా తూడు, మేట వేసుకున్న జమ్మి మాత్రమే కనిపిస్తోంది. పంట కాలువలకు ఇంకా నీరు చేరలేదు. దీంతో కాలువ చివరి భూములకు సాగునీరు చేరే అంశం ప్రశ్నార్థకంగా మారింది. కాలువలు తూడు తొలగింపు ఎన్నడో ?, సాగునీరు చేరేది ఎప్పుడో? అంటూ అన్నదాతలు నిట్టూరుస్తున్నారు.



కంకిపాడు కాలువలో తూడు, జమ్మి



కంకిపాడు పుల్లేరు లాకులు..



చిట్టడవిని తలపిస్తున్న ఈడుపుగల్లు - ఉప్పలూరు మధ్య మురుగుబోదె

నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు కృషి



ఒప్పంద పత్రాలు చూపుతున్న ప్రొఫెసర్లు

రామవరప్పాడు: ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు సీఐటీడీ(సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ టూల్ డిజైన్) సంస్థతో ఒప్పందం చేసుకున్నామని విజయ ఇంజినీరింగ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తుమాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఎనికేపాడులోని వీఐటీడబ్ల్యూ కళాశాలలో మంగళవారం సీఐటీడీ ప్రిన్సిపాల్ డైరెక్టర్ విజయ్ కృష్ణకాంత్‌తో విద్యార్థులకు శిక్షణ నిమిత్తం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సీఐటీడీ ఒప్పందంతో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్స్‌లో భాగస్వామ్యంతో విద్యార్థులకు విశిష్ట అవకాశాలు అందిస్తామన్నారు. సర్టిఫికెట్ కోర్సులు, షార్ట్ టర్మ్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, ఇన్‌ప్లాంట్ ట్రైనింగ్, ఫైనల్ ఇయర్ ప్రాజెక్టుల కోసం విద్యార్థులకు సీఐటీడీ సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందంతో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరుస్తూ పారిశ్రామిక అవసరాలకు సిద్ధం చేస్తామన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలతో పాటు డిప్లమా విద్యార్థులకు లాటెరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ ప్రవేశంలో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీడీ ఉపకేంద్ర డెప్యూటీ డైరెక్టర్ సోమల వెంకట కృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవలక్ష్మి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి విష్ణుప్రియ, ఐటీ విభాగాధిపతి విజయ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో బహుళ ప్రయోజనాలు

గన్నవరంరూరల్: విత్తన శుద్ధితో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏడీఏ ఎం.సునీల్ తెలిపారు. మండలంలోని కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విత్తన శుద్ధితో మొలక శాతం ముందస్తుగా తెలుస్తుందని చెప్పారు. విత్తనాలు మంచివి కాకపోతే వాటిని చల్లకుండా ముందుగానే ఆగిపోవచ్చన్నారు. విత్తన శుద్ధి ప్రక్రియకు సూచనలు చేశారు. కిలో వరి విత్తనాలకు మూడు గ్రాములు కార్బన్డిజం కలిపి నానబెట్టాలని తెలిపారు. నారుమడికి నాట్లు వేసే వారం రోజులకు ముందు కార్బోఫ్యూరన్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. విత్తన శుద్ధితో రైతులకు మేలు జరుగుతుందని, ప్రతి రైతు పాటించాలన్నారు. వ్యవసాయ శాఖ ఏవో శివప్రసాద్, సిబ్బంది భవాని, కల్యాణ్, రైతులు మల్లారెడ్డి కిశోర్, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



కొండపావులూరులో పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏవో శివప్రసాద్



నున్నలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

80 శాతం సబ్సిడీపై డ్రోన్ యూనిట్

నున్న(విజయవాడరూరల్): రైతు గ్రూపులకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ యూనిట్‌లను ప్రభుత్వం అందజేస్తోందని విజయవాడ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు తెలిపారు. నున్న గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఐదుగురు చొప్పున గ్రూపుగా ఏర్పడిన రైతులకు రూ.9.80 లక్షల విలువైన డ్రోన్ యూనిట్ ను 80 శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. ఎరువులు, పురుగు మందులు, నానో యూరియా ఎరువు పిచికారీ చేసుకునేందుకు డ్రోన్‌లు దోహదం చేస్తాయని చెప్పారు. రాబోయే రోజుల్లో కూలీల కొరత ఏర్పడనున్న నేపథ్యంలో యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. వరినారు మళ్లలో ఇనుప దాతువు లోపం రాకుండా ఉండేందుకు అన్నబేది, నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలని, జింకుదాతు లోపం రాకుండా ఉండటానికి జింకు కూడా వాడాలని రైతులకు సూచించారు. 26 రోజుల నుంచి 30 రోజుల లోపు వరినాట్లు వేయాలన్నారు. అనంతరం మండవ రత్తయ్య అనే రైతు వరినారు మడిని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రఘురామ్, రైతులు వై.కోటిరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, రాజు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి..

పెనమలూరు: నారుమళ్లకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో లంకా శ్రీనివాసరావు సూచించారు. ఆయన మంగళవారం చోడవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. సాగుకు రైతులు వేసిన నారుమళ్ల విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నారుమళ్ల వారం రోజుల్లో డీఏపీ వాడాలని అయితే డీఏపీ కొరతగా ఉన్నందున నానో డీఏపీ ఎకరాకు లీటర్ స్ప్రేయర్‌తో కానీ డ్రోన్‌తో కానీ పిచికారి చేయాలన్నారు. నారుమళ్ల ఎదిగిన తరువాత నాట్ల సమయంలో పొలం దుమ్ములో సూపర్ పాస్పేట్ ఎకరానికి 100 కేజీల చొప్పున వేయాలన్నారు. రైతులు సస్యరక్షణ చర్యల విషయంలో సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఏవో చెప్పారు.



చోడవరంలో సూచనలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తత అవసరం

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరులోని మహిళా సాధికార కేంద్రంలో మంగళవారం సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సంస్థ(ఆర్డిడ్స్), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ ఎస్.కాళహస్తి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు, రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నాయన్నారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా డిపాజిటర్లు తమ హక్కులు, రక్షణ చర్యలపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం ఇవ్వవద్దని తెలిపారు. ఆర్డిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, కార్యదర్శి వై.సాంబశివరావు, డీఆర్డీఏ సహాయక మేనేజర్ భూపతి, మహిళా సంఘాల కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిబంధనలకు అనుగుణంగా ఎరువులు విక్రయించాలి

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఫెర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసారిగా ఈ పోస్ మిషన్ల ద్వారానే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీఎస్వీ.మనోహరరావు ఆదేశించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం గన్నవరం సబ్ డివిజన్‌లోని ఎరువుల విక్రయ లైసెన్స్ కలిగిన 53 మంది డీలర్లకు మంగుళూరు కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, పారాదీప్ ఫాస్ఫేట్ సహకారంతో ఎల్1 మోడల్ ఈ–పోస్ మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో డీలర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు స్టాక్ వివరాలను పట్టిక రూపంలో ప్రదర్శించాలని సూచించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.సునీల్, పలువురు పారాదీప్, ఎన్టీ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



డీలర్లకు ఈ-పోస్ మిషన్లు అందజేస్తున్న మనోహరరావు

సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

పెనమలూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. పెనమలూరులో మెరుగు విజయ్‌కుమార్ ప్రాంగణంలో మంగళవారం సీపీఐ పెనమలూరు నియోజకవర్గ సమితి 25వ మహాసభలు జరిగాయి. సీనియర్ నాయకుడు గాలంకి వసంతరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కశ్మీర్‌లో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకుంటే ఇప్పటి వరకు నిందితులను పట్టుకోవటంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఘటనను మరుగున పడేయటానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అమెరికాకు దాసోహమైందన్నారు. అమెరికా స్వార్థం కారణంగానే నేడు యుద్ధం జరుగుతుందని తెలిపారు. ఈ యుద్ధం వలన క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



పెనమలూరులో మాట్లాడుతున్న నార్ల వెంకటేశ్వరరావు

8, 9 తేదీల్లో జిల్లా మహాసభలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. యోగాంధ్ర పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసి ప్రజా ధనాన్ని వృథా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా నేడు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ గత వందేళ్లలో అనేక త్యాగాలు చేసిందన్నారు. జూలై 8, 9 తేదీల్లో జిల్లా మహాసభలో గన్నవరంలో, రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, పెనమలూరు నియోజకవర్గ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, నాయకులు వి.బాలస్వామి, మోతుకూరి అరుణ్‌కుమార్, బండి ప్రేమ్‌కుమార్, ముత్యాల పోతురాజు, నాగేశ్వరరావు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు. మానికొండ రహదారి పై వంతెన నిర్మించాలని, బుడమేరు ముంపు నుంచి రక్షణ కల్పించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని తీర్మానాలు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వీటిపై అవగాహన పెంచుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు పంపిన ఏపీకే యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని, వీటి ద్వారా ఫోన్లు హ్యాకింగ్‌కు గురవుతున్నాయని చెప్పారు. ఓటీపీలు, ఏటీఎం కార్డు పిన్, బ్యాంకు ఖాతా వివరాలను గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద కాలంలో పోలీసులకు సమాచారం అందించటం ద్వారా రక్షణ పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, గుట్కా వంటి నిషేధిత మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సత్యనారాయణ సూచించారు. బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల నియంత్రణకు అమలు చేస్తున్న పోక్సో చట్టం గూర్చి వివరించారు. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్, ఆంగ్ల ఉపాధ్యాయుడు మానికొండ రమణగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

నున్న(విజయవాడరూరల్): వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ పాలిటెక్నిక్ డిప్లమో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కార్యదర్శి ఎస్.సత్యనారాయణ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రకటించిన ఫలితాల్లో మొదటి, రెండో ఏడాది ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో సీఎంఈ విద్యార్థులు అర్థపాక వర్షిప్ప 96 శాతం మార్కులు, మూడ్ మేఘన 95.4 శాతం, ఏఐఎంఎల్‌లో బోయ ఉదయ్ కుమార్ 94 శాతం, సివిల్ విభాగంలో మైల ప్రణయ్‌కాంత్ 93.4 శాతం మార్కులు సాధించారన్నారు. రెండో ఏడాది ఫలితాల్లో ఏఐఎంఎల్‌లో పి.శివకుమార్ 97.8 శాతం, ఏ.నికిత 96.4 శాతం సీఎంఈలో పి. గణేష్ 96.7 శాతం ఎం.నిఖిల్ కుమార్ 96 శాతం ట్రిపుల్ ఈలో ఎస్.సూర్యప్రకాష్ 93.6 శాతం మెకానికల్‌లో టి.సురేష్ 92.1 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన జెడ్పీ విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థినులను పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులైన డింపుల్ ప్రియ(581), భార్గవి అఖిల(573) మార్కులతో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. డింపుల్ ప్రియ నూజివీడులో, భార్గవి అఖిల ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించి పలువురుకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు.



డింపుల్ ప్రియ



భార్గవి అఖిల

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోని మరకత శివలింగానికి మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వయంగా మరకత శివలింగానికి అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. అలాగే శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ మహదేవపురం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా తులసీనగర్, వరలక్ష్మీపురం, పంట కాలువ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.